క్లుప్తంగా

నీటి సరఫరాకు అంతరాయం

మానవపాడు: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో 3వ తేదీ సోమవారం మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఉండనున్నట్లు మిషన్ భగీరథ ఏఈ తేజవర్ధన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రేవులపల్లి, ధరూర్ మండలంలో నీటి శుద్ధి కర్మాగారాల్లో మరమ్మతు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

మానవపాడు: మద్యం తాగి వాహనం నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా రోడ్డు ప్రమాదలకు కారణమవుతున్నట్లు పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపైనే మురుగు



అలంపూర్: ప్రధాన రోడ్డు మార్గాల్లో మురుగు సమస్య వేధిస్తుంది. అలంపూర్ చౌరస్తాలోని అలంపూర్ రోడ్డు మార్గంలో డ్రెయినేజీ లేక వర్షపు నీరు రోడ్డు పక్కనే నిలిచి మురుగుగా మారుతుంది. మురుగు కారణంగా దుర్వాసన వస్తుందని, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య ఉత్పన్నమవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు దృష్టి సారించి మురుగుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్యాస్ లీక్.. తప్పిన ప్రమాదం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై న ఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది వెంకటయ్య కథనం మేరకు.. పట్టణంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న కులదీప్ ఇంట్లో ఉదయం వంట చేసేందుకు గ్యాస్ అంటించాడు. ఈ క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. సకాలంలో తేరుకుని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అత్యవసర సమయాల్లో సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రమాదాలు నిలువారించాలని సూచించారు.

గడ్డిమందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం: మనస్థాపంతో యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మండలంలోని పూడూరు–ఎర్రవల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డికి గ్రామ శివారులో పొలం ఉంది. ఈ క్రమంలో పక్క పొలం వ్యక్తి తన పొలంలో సర్వే చేయించేందుకు అధికారులను తీసుకురావడంతో మనస్థాపం చెంది ఆదివారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళికలు

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి 100 రోజుల కార్యాచరణను రూపొందించి ముందుకెళ్తున్నట్లు కమిషనర్ చికిరె శశిధర్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమావేశమై యాక్షన్‌ప్లాన్ వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, వనమహోత్సవం, ఇంకుడు గుంతల నిర్మాణాలు తదితర విషయాలపై పట్టణవాసులకు అవగాహన కల్పించనున్నామన్నారు. వార్డుల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్లాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

అమరచింత: ఆత్మకూర్ నుంచి మస్తీపురం గ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తున్న మస్తీపురం గ్రామానికి చెందిన యువకుడు మహేందర్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రక్తపు గాయాలతో రోడ్డుపై పడి ఉన్న మహేందర్‌ను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. విషయాన్ని మహేందర్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా.. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మరమ్మతు కేంద్రానికి మోక్షం



ఎక్లాస్‌పురం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం

- తీరనున్న రైతుల ఇక్కట్లు
- తప్పనున్న రవాణా భారం

అయిజ: రైతన్నలు ఎన్నో ఏళ్లు ఎదురు చూసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. మండలంలోని ఎక్లాస్‌పురం శివారులో 2023 జూన్‌లో రూ. 40 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టర్ ప్రతాప్‌రెడ్డి 2024 మే నాటికి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం షెడ్డు పనులు పూర్తి చేశారు. సదరు కాంట్రాక్టర్ విద్యుత్ శాఖతో అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉండగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు బదిలీ కావడంతో పనులు అలస్యమయ్యాయి. ఇటీవల 'టీజీ ఎస్‌పీడీసీఎల్' సంస్థతో కాంట్రాక్ట్ అగ్రిమెంట్ పూర్తి కావడంతో 2025 మే 26న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్ర భవనాన్ని ప్రారంభించారు.

నాలగు మండలాల రైతులకు ఉపయోగం..

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని అయిజ మండలంలో ఏర్పాటు చేయడంతో గట్టు, అయిజ, మల్దకల్, వడ్డేపల్లి మండలాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇంతకాలం ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే రైతులు జిల్లా కేంద్రానికి లేదా అలంపూర్ నియోజకవర్గ కేంద్రానికి తరలించాల్సి వచ్చేది. దీంతో రైతులకు రవాణ చార్జీలు అధికంగా ఉండేవి. అదే విధంగా సమయం కూడా వృథా అయ్యేది. రైతులను ఆ సమస్యల నుంచి గట్టెక్కించేందుకు విద్యుత్ అధికారులు అయిజ మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రానికి శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో మరమ్మతు కేంద్రం ఏళ్ల తరబడి ఎదురుచూసిన మరమ్మతు కేంద్రం ప్రారంభించడంతో నాలగు మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రవాణా భారం తగ్గింది



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం అయిజలో ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల మండలాల రైతులకు రవాణా ఖర్చులు, సమయం కూడా వృథా కాకుండా ఉంటుంది. మరమ్మతు కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లకు వేగంగా మరమ్మతు చేయాలి.

– జగన్నాథరెడ్డి, రైతు, అయిజ

రైతులకు ఎంతో ఉపయోగం



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం అయిజ మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం వలన నాలుగు మండలాల రైతులకు మేలు కలుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన వెంటనే రైతులు మరమ్మతు కేంద్రానికి తరలించడంతో సమయం ఆదా అవుతుంది.

– నరేందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ

ఆలయాల నిర్మాణానికి విరాళం

ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఆలయాల నిర్మాణాల కోసం ఆదివారం మాజీవార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాస్ రూ.1.25 లక్షల నగదును నిర్వాహకులకు అందజేశారు.

రేపటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్ట మైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ఆలయాల ప్రారంభోత్సవాలు, ప్రతిష్ఠ మహోత్సవాలను జూన్ 3 నుంచి 5 వరకు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, ఎస్టీడీ శ్రీను, ఆనంద్, కొండాపురం రాము, మణివర్ధన్‌రెడ్డి, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న శ్రీనివాసులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



గట్టు: మండల పరిధిలోని చిన్నోనిపల్లె గ్రామంలో శంకరమ్మకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.18,500 చెక్కును ఆదివారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అందజేశారు. వైద్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైనట్లు మాజీ ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, హనుమంతురెడ్డి, గూరన్న, ఈరన్న, తిమ్మప్ప, బోయ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఆత్మకూర్: క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని డీకే కృష్ణ జువెల్లర్స్ అధినేత విశ్వప్రకాష్ అన్నారు. స్థానిక జాతర మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం కొనసాగాయి. మొత్తం 36 జట్లు పోటీపడుతున్న ఈ పోటీల్లో విజేతకు మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం రూ.50,116, రెండో బహుమతి రూ.30,116 నగదుతో పాటు షీల్డులను అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరుణ్, అనుదీప్, ఇమ్రాన్, అఫ్రోజ్, అస్లాం, రాకేష్, నాని, మహేందర్, భరత్, శ్రీకాంత్, గాండ్లశివ,శ్రీధర్, నవీన్, కోచ్ ఖాదర్, క్రీడకారులు పాల్గొన్నారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరు: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన మండల వాసులు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. దాదపు గంట పాటు వర్షం కురిసింది. భారీ వర్షంతో పంట సాగుకు అనుకూలంగా మారనుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆపరేషన్ 'కగార్' నిలిపివేయాలి

ఆత్మకూర్: ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను అణిచి వేస్తుందని, విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కుట్రలు పన్నుతున్నారని వామపక్షాల పార్టీల నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, రాజు, మోష, రాబర్ట్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

ఆర్థిక సాయం అందజేత



ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ ఇటీవల మృతి చెందాడు. ఈ క్రమంలో ఆదివారం గ్రామస్తులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుని భార్యకు రూ. 24,500 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. కార్యక్రమంలో దేవేంద్రరెడ్డి, తులసినాయుడు, హరికృష్ణ, శేషన్న, లక్ష్మన్న, రాఘవేంద్ర, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంలో అమరచింత చిన్నారుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న ఐశ్వర్య



నృత్య ప్రదర్శనలో చిన్నారి శ్రీవైష్ణవి

అమరచింత: తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో నిర్వహిస్తున్న నృత్య ప్రదర్శనలో అమరచింత మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. పాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐశ్వర్య అంగవైకల్యం ఉన్న కూచిపూడి నృత్యంలో సత్తా చాటింది. జైపూర్ పాదంతో నృత్య ప్రదర్శన ఇవ్వడంతో పలువురి ప్రశంసలు అందుకుంది. అదే విధంగా అమరచింత గ్రామానికి చెందిన నవీన్ కుమార్తె శ్రీవైష్ణవి సైతం కూచిపూడి నృత్యంలో రాణించి సత్తా చాటింది. ఈమేరకు ఐశ్వర్య తల్లి భారతి మాట్లాడుతూ తన కుమార్తె ఐదేళ్ల వయస్సు ఉన్నప్పుడు జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోయిందని, అప్పటి నుంచి రబ్బర్ కాలు అమర్చామన్నారు. ప్రస్తుతం అమరచింతలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి పూర్తి చేసిందన్నారు. నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి వారు రామేశ్వరంలో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కూడలిలో కుక్కల బెడద



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని జాతీయ రహదారి కూడలిలో కుక్కల బెడద అధికమైంది. నాలుగు రోడ్ల కూడలిలో కుక్కలు గుంపులుగా చేరి స్థానికులు, వాహనదారులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. బైక్ వంటి వాహనాల వెంటపడుతుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. కుక్కల బెడద రోజు రోజుకు పెరుగుతుండటంతో స్థానికులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

3 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

అమరచింత: మండలంలోని మిట్టనందిమళ్లలో ఈ నెల 3 నుంచి 5 వరకు శ్రీశ్రీపాటిమీది ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. 3న జలాధివాసం, ప్రధాన దేవత హోమం, మహామంగళ హారతి, 4న ధాన్యాధివాసం ప్రతిష్ఠా హోమం, 5న యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపన, కలశ విగ్రహ ప్రతిష్ఠాపనలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు.



శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ కరుణాకర్‌కు నోటీసులు జారీ చేస్తామని గ్రంథాలయ సెక్రటరీ శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో 'గ్రంథాలయం తెరిచే సమస్యే లేదు' అనే కథనానికి స్పందించిన సెక్రటరీ గ్రంథాలయంలో రికార్డ్ అసిస్టెంట్, స్వీపర్‌ను నియమించినప్పటికి ఇద్దరు విధుల్లో ఉంటూ గ్రంథాలయం మూసివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత నిర్ణయాలతో గ్రంథాలయం మూసి పాఠకులకు ఇబ్బంది కలుగచేయడంపై నోటీసులు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గ్రంథాలయం మూసి ఉంచడంపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.



శాంతినగర్‌లో మూసి ఉన్న గ్రంథాలయం

రాష్ట్ర అవతరణ వేడుకలకు ముస్తాబు



అలంపూర్‌లో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

అలంపూర్: రాష్ట్ర అవతరణ వేడుకలకు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. ఈనెల 2న సోమవారం నిర్వహించనున్న వేడుకలకు నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సంబరాలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ మంజుల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ ఉంటుందన్నారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయంలో వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రావు తెలిపారు. అదే విధంగా 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు– అభివృద్ధికి మలుపు నినాదంతో వాక్ విత్ కమిషనర్ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, మున్సిపాలిటీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వేడుకలు

శాంతినగర్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 9 గంటలకు వడ్డేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి, ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు హాజరుకావాలని ఈ సందర్భంగా కోరారు.

చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

ధరూరు: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చి, కల్వరి చర్చి, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజ మందిరాల్లో జూన్ నెల మొదటి ఆదివారం సందర్భంగా ప్రత్యేక బల్లారాధన ప్రార్థనలు చేశారు. స్థానిక ఎంబీ షాలేం చర్చిలో పాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రభు బల్లారాధన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బైబిల్ ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, యూత్ తదితరులు పాల్గొన్నారు.



ఎంబీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రెచ్చిపోతున్న మందుబాబులు



కొండాపురం ఉన్నత పాఠశాల తలుపుల వద్ద మద్యం సీసాలు



మానవపాడులో బృహత్‌పల్లె ప్రకృతి వనంలో మద్యం సీసాలు

మానవపాడు: అధికారులు నిర్లక్ష్యం, మందుబాబుల వికృత చేష్టలతో పల్లె ప్రకృతి వనాలు, పాఠశాలలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని బృహత్ పల్లెప్రకృతి వనం మందుబాబులకు అడ్డాగా మారిందంటున్నారు. ఎక్కడ చూసినా మందుసీసాలు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు.

పాఠశాలలో మద్యం సీసాలు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. విద్యను నేర్పించే పాఠశాలలో ఆకతాయిలు మందుతాగి సీసాలను పాఠశాల ప్రాంగణంలోనే వదిలేసి వెళ్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారి– 44పై బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, హైవే సిబ్బంది తెలిపిన వివరాలు.. అయిజ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన ఈరన్న, భార్య సత్యమ్మతో బైక్‌పై గార్లపాడుకు వెళ్తుండగా మానవపాడు స్టేజి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఈరన్నకు కుడి కాలు విరిగింది, భార్య సత్యమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



మానవపాడులో నుజ్జునుజ్జయిన బైక్

అదుపు తప్పిన బైక్.. వ్యక్తికి గాయాలు

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే స్టేషన్ సమీపంలో అలంపూర్ మండలం లింగన్‌వాయి గ్రామానికి చెందిన మనోరాజు కర్నూల్ నుంచి బైక్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. గాయాలపాలైన మనోరాజును కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

గుంతల రోడ్డుతో పొంచి ఉన్న ప్రమాదం



బిజ్వారం- సంగాల రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

మల్దకల్: మండలంలోని బిజ్వారం– సంగాల, ఎల్కూరు– మల్దకల్ రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్డుపై ఏర్పడిన గుంతల వలన వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురైతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.